క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ,అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో ఆదివారం కృత్తికానక్షత్రాన్ని పురస్కరించుకుని ఈఓఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయమాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఆదివారం ప్రత్యేక ప్రార్థనలో ఆర్డీఓ



సీఎస్ఐ ప్రార్థనా మందిరంలో హాజరైన ఆర్డీఓ దాస్

ఆత్మకూరు: పట్టణంలోని ఇందిరానగర్ సీఎస్ఐ ప్రార్థనా మందిరం నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఆర్డీఓ దాస్ దంపతులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని, రైతులు ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. తనను ఆహ్వానించిన సీఎస్ఐ ప్రార్థనా మందిరం నిర్వాహకులు కృతజ్ఞతలు చెప్పారు. చర్చి సంఘం అధ్యక్షుడు అంకన్న, రాజు, ఆంజనేయులు, శీలం శేషు, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



సంఘమేశ్వరం వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలోని సంగమేశ్వరం క్షేత్రం, గోపవరం గ్రామాల్లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ పర్యటన దృష్ట్యా ఆదివారం నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఆత్మకూరు నుంచి గోపవరం, సంగమేశ్వరం క్షేత్రాలకు వెళ్లి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీస్ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ శృతి, సీఐ సుబ్రహ్మణ్యంతో పాటు సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు దుకాణాల వేలం

మిడుతూరు: మిడుతూరు గ్రామ పంచాయతీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లోని 14 (దుకాణాలు) షాపులను 28వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుధీర్ ఆదివారం తెలిపారు. గ్రామ సర్పంచ్ జయలక్ష్మమ్మ, ఈఓఆర్డీ ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 14 షాపులకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేలం పాటలో మిడుతూరు గ్రామ పంచాయతీకి చెందిన వారు మాత్రమే పాల్గొనాలని స్పష్టం చేశారు. పాల్గొను వారు గ్రామ పంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండరాదని (ఇంటిపన్ను, కుళాయిపన్నులు) చెల్లించి నో డ్యూ సర్టిఫికేట్‌ను పంచాయతీ కార్యదర్శి నుంచి పొందాలని తెలిపారు. సోమవారం సాయంత్రానికి గ్రామ పంచాయతీ నిబంధనల మేరకు నో డ్యూ సర్టిఫికెట్లు పొంది మంగళవారం వేలం పాటలో పాల్గొనాలన్నారు.

ఫారం భూముల ఆక్రమణ



ఫారం భూమిలో ఏర్పాటు చేసిన బంకులు

జూపాడుబంగ్లా: మండలకేంద్రమైన జూపాడు బంగ్లాలో కేజీ రోడ్డు పక్కన తంగడంచ ఫారం భూములున్నాయి. కేజీ రోడ్డు పక్కన స్థలాలు ప్రస్తుతం సెంటు రూ.2 నుంచి రూ.4లక్షల దాకా రేటు పలుకుతున్నాయి. అలాంటి విలువైన ఫారం భూములను కొందరు ఎలాంటి అనుమతుల్లేకుండా యథేచ్ఛగా ఆక్రమించుకొని బంకులు ఏర్పాటుచేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అయినా ఫారం అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫారం అధికారులు ఇలాగే నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తే మరింత స్థలం ఆక్రమణకు గురయ్యే అవకాశాలున్నాయి. ఈ విషయమై ఫారం ఏడీఏ విజయశేఖర్‌ను వివరణ కోరగా ఫారం స్థలం ఆక్రమణకు గురైన సంగతి తెలుసుకొని స్థలం ఆక్రమించిన వారి పేర్లతో సహా జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో నెలరోజుల క్రితమే ఫిర్యాదు చేశాం. పోలీసు వారు చర్యలు తీసుకోకపోతే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణలను తొలగింపజేస్తామని వెల్లడించారు.

యంత్ర సాయం.. తగ్గుతున్న భారం

- యంత్రాలతో వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్న రైతులు
- శ్రమ, ఖర్చు తక్కువ
- యంత్రాలతో నూర్పిళ్లతో ఒక్క రోజులోనే ఇంటికి చేరుతున్న ధాన్యం
- వైఎస్సార్ యంత్ర సేవతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



యంత్రంతో మొక్కజొన్న పంటను నూర్పిడి చేస్తున్న దృశ్యం



జూపాడుబంగ్లా: మారుతున్న పరిస్థితులను అనుసరించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అగ్రికల్చర్ అధికారుల సూచన మేరకు రైతులు ఎప్పటికప్పుడు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ లాభాలు గడించేందుకు కృషి చేస్తున్నారు. అందుకనుగుణంగా వ్యవసాయ యంత్రపరికరాలను వినియోగించి తక్కువ శ్రమ, పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగుతున్నారు. వీరికి చేయూతగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రాయితీపై యంత్రపరికరాలను అందజేసి ప్రోత్సహిస్తున్నారు.

ఎకరాకు రూ.2,500ల నుంచి రూ.2,700 వరకు ఖర్చు

ప్రస్తుతం రబీ సీజన్ పంటలు చేతికందటంతో రైతులు పంట నూర్పిడిలో బిజీ బిజీగా ఉన్నారు. కూలీలతో ఎకరా మొక్కజొన్న పంట నూర్పిడికి రూ.4,500లు ఖర్చు అవుతుంది. యంత్రాలతో ఎకరాకు కేవలం రూ.2,500ల నుంచి రూ.2,700ల మాత్రమే ఖర్చు కావటం, గంట వ్యవధిలోనే ధాన్యం ఇంటికి చేరుతుండటంతో రైతులు వ్యయభారం తగ్గించుకొనేందుకు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. అదే కూలీలతో అయితే రెండు మూడు రోజులు సమయం పడుతుంది. నందికొట్కూరు నియోజకవర్గం వ్యాప్తంగా జూపాడుబంగ్లా, పాములపాడు, మిడుతూరు, పగిడ్యాల, కొత్తపల్లి, నందికొట్కూరు మండలాల పరిధిలో రబీ సీజన్‌కు గాను 8,566 హెక్టార్లలో మొక్కజొన్న పంటను సాగుచేశారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటనూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతుండటంతో ఒక్కో గ్రామంలో రెండు, మూడు నూర్పిడి యంత్రాలు నిరంతరంగా పని చేస్తున్నాయి.

యంత్రసేవతో ప్రభుత్వ ప్రోత్సాహం

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకుగాను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి యంత్రసేవ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈపథకం కింద పది మంది రైతులు గ్రూపుగా ఏర్పడితే రాయితీపై వారికి అవసరమైన యంత్ర పరికరాలను అందజేస్తున్నారు. నందికొట్కూరు నియోజకవర్గం వ్యాప్తంగా ఇప్పటి దాకా రూ.7.50 కోట్ల విలువైన పంట నూర్పిడి యంత్రాలు, ట్రాక్టర్లు, రొటావేటర్లు, గొర్రు,నాగలి, డ్రైవాన్, బ్యాటరీ పంపులు, టార్పలిన్ పట్టాలు, లింక్ పైపులు, పీయుసీ పైపులు వంటి పలురకాల యంత్రపరికరాలను రైతులకు అందజేశారు. గ్రూపుల్లోని రైతులు వాటిని వినియోగించుకొంటూ తక్కువ పెట్టుబడితో అధికదిగుబడులు సాధిస్తున్నారు.

ఖర్చు, సమయం తగ్గింది



రబీ సీజన్‌కుగాను నేను పదిఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాను. ఇప్పటిదాకా ఐదు ఎకరాల్లోని మొక్కజొన్న పంటను నూర్పిడి చేశాను. ఎకరాకు రూ.2,700 చొప్పున ఐదు ఎకరాలకు రూ.13,500లు చెల్లించి యంత్రంతో నూర్పిడి చేయించాను. నూర్పిడిచేసిన ధాన్యం మొత్తం కేవలం రెండు గంటల్లోనే ఇంటికి చేర్చుకోగలిగాను. వ్యవసాయ కూలీలతో అయితే ఐదు ఎకరాల పంటనూర్పిడి చేసుకోవాలంటే కనీసం పదిరోజుల సమయంతో పాటు ఎకరాకు రూ.4,000ల చొప్పున రూ.20వేలు వెచ్చించాల్సి ఉంటుంది. – పీఎం మహేష్, తర్తూరు, రైతు

యంత్రాల వినియోగంతో ప్రయోజనం



మారుతున్న పరిస్థితులను అనుసరించి రైతులు వ్యవసాయంలో యంత్రపరికరాలను వినియోగించుకోవటం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. తక్కువ పెట్టుబడితో అధికదిగుబడులు సాధించే అవకాశాలున్నాయి. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించేలా ప్రభుత్వం 'వైఎస్సార్ యంత్ర సేవ' పథకం కింద రైతులను గ్రూపులుగా ఏర్పాటుచేసి వారికి రాయితీపై యంత్రపరికరాలను అందజేస్తున్నాం. ఇప్పటిదాకా రూ.7.5కోట్ల విలువైన యంత్రపరికరాలను సుమారు 20గ్రూపుల రైతులకు అందజేశాం. – విజయశేఖర్‌రెడ్డి, ఏడీఏ, నందికొట్కూరు

శ్మశాన కార్మికుల సమస్యలు పరిష్కరించండి

నందికొట్కూరు: శ్మశాన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ శ్మశాన కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తలారి నాగరాజు కోరారు. ఆదివారం ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌కు ఆయన స్వగృహంలో వినతి పత్రం అందజేశారు. తర్తూరు గ్రామంలో శ్మశాన కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యేతో వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్మశాన కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జమ్మన్న, ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, నాయకులు సుబ్బన్న, రంగస్వామి, డేవిడ్ పాల్గొన్నారు.

30 నుంచి తిరునాల

పగిడ్యాల: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 30 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు లక్ష్మీ చెన్నకేశవస్వామి, సీతారాముల తిరుణాల మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ అభిజిత్ లగ్న సుమూహూర్తం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు లక్ష్మీచెన్నకేశవ, సీతారాముల కళ్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. 31న రథోత్సవం, ఏప్రిల్ ఒకటిన పారువేట ఉత్సవం , 2న వసంతోత్సవంతో తిరుణాల ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయని పేర్కొన్నారు.

29న మున్సిపల్ సమావేశం

నందికొట్కూరు: ఈ నెల 29న మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిశోర్ ఆదివారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఆయాశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రగతి నివేదికలతో సమావేశానికి రావాలని పేర్కొన్నారు.

వైభవంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆత్మకూరు: మండలంలోని ముష్టపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీమారెమ్మ దేవాలయంలో మారెమ్మ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవంగా సాగింది. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పల్లకీలో అమ్మవారి విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి,వైస్ చైర్మన్ రాజగోపాల్, కౌన్సిలర్లు విజయచౌదరి, సుల్తాన్, రెహమాన్, గ్రామసర్పంచ్ రవినాయక్, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేత పంచలింగాల వృషభాలు



మొదటి బహుమతి అందిస్తున్న గ్రామపెద్దలు

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీసమేత వేణుగోపాల స్వామి, శ్రీ పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం సందర్భంగా గ్రామంలో ఆదివారం గ్రామపెద్దల సమక్షంలో వృషభాల రాష్ట్ర స్థాయి పాలబండ లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలలో మొదటి బహుమతి రూ.25 వేలు పంచలింగాల గ్రామానికి చెందిన సుంకన్న వృషభాలు, రెండో బహుమతి రూ.20వేలు సోమయాజులపల్లె గ్రామానికి చెందిన నరసయ్య వృషభాలు, మూడో బహుమతి రూ.15వేలు ముక్కమల్ల చంద్రశేకర్‌రెడ్డి, బుక్కాపురం మద్దయ్యలకు చెందిన ఎద్దులు, నాల్గవ బహుమతి రూ.10వేలు మల్యాల గ్రామానికి చెందిన నైమున్నా, ఐదవ బహుమతి రూ.5వేలు దాసరిపల్లెకు చెందిన సురేష్ కుమార్ వృషభరాజములు గెలుపొందాయి. గ్రామపెద్దల సమక్షంలో విజేతలైన వృషభాల యజమానులకు బహుమతులు అందజేశారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' పంపిణీ

వెలుగోడు: వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఆసరా చెక్కులను అందజేస్తారని చెప్పారు. పొదుపు సంఘాల మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆయా శాఖల అధికారులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

'ఛలో ఢిల్లీ' విజయవంతం చేయాలి

ఆత్మకూరు: దేశ వ్యాప్తంగా కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహనాయక్, స్వాములు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కురుకుందతో పాటు పలు గ్రామాల్లో జీపుజాతా నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశ సంపదను ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని ప్రజలు ప్రతిఘటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు స్వాములు, హరికృష్ణ, గోపాల్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రాణప్రతిష్ఠ పూజలు



ప్రాణ ప్రతిష్ఠకు సిద్ధం చేసిన విగ్రహాలు

పాములపాడు: మండలంలోని బానుముక్కల గ్రామంలో సోమవారం నుంచి శ్రీసీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుడి ఉత్సవ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి 30 వరకు నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 27న ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనము, దీక్షా ధారణ, మాతృకా పూజ, నవగ్రహ వాస్తు, భద్ర మండల, దేవతాకలశ స్థాపన, సాయంత్రం అగ్ని ప్రతిష్ఠా, అంకురార్పణ జలాధివాసం నిరాజన. 28వ తేదీన ప్రాతఃకాల పూజలు, ఆవాహిత దేవతా హోమాలు, మహా సుదర్శన హోమం, సాయంత్రం మహాస్నాపనం, దాన్యాధివాసం, నీరాజనం కార్యక్రమాలు ఉంటాయన్నారు. 29న ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, ప్రతిష్ఠాంగ హోమాలు, ప్రాణ ప్రతిష్ఠ, కక్ష్యజ్వాల, బలి ప్రదానం, జమాది హోమం, మహా పూర్ణాహుతి, శాంతి కళ్యాణం, 30వతేదీ శ్రీరామ నవమి పర్వదినములో పునర్వసు నక్షత్ర శుభపుష్కరాంశం నందు అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణమహోత్సవంతో ప్రాణప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు ముగుస్తాయని వివరించారు.


హిందూ సంస్కృతిని చాటిచెబుదాం



ఉపాధ్యాయులతోపూర్వ విద్యార్థులు

వెలుగోడు: మన దేశంలోని హిందూ సంస్కృతి, సంప్రదాయాలను చాటా చెప్పాలని నంద్యాల రామకృష్ణారెడ్డి డిగ్రీ కాలేజీ వ్యవస్థపకుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని సరస్వతి శిశు విద్యా మందిర్ 27వ వార్షికోత్సవం, పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పొట్టి శ్రీరాములు సెంటర్‌లో అమరజీవి విగ్రహానికి ఎంపీపీ లాలం రమేష్‌తో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ప్రబంధకారిణి సభ్యులు సెంటర్ నుంచి చెన్నకేశవ స్వామి ఆలయం వరకు డప్పులో ప్రదర్శన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను, కమిటీ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా కమిటీ కార్యదర్శి హేమనాథ్, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, మాజీ ఎంపీపీ సీతామహాలక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ అల్లె తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



హర్షిత్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలం నుంచి బొట్ల హర్షిత్ నేషనల్ మెరిట్‌కమ్‌మీన్స్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు కాకతీయ సంఘ సత్ర కార్యదర్శి టీఆర్‌సీ బోస్ ఆదివారం తెలిపారు. శ్రీశైలంలోని జిల్లా పరిషత్‌పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బొట్ల హర్షిత్ 180 మార్కుల పరీక్షలో 105 మార్కులు సాధించి ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు వెల్లడించారు. పేద విద్యార్థులు, తలిదండ్రులు లేని విద్యార్థులకు కాకతీయ సంఘంలో వసతి కల్పించి ప్రత్యేక శ్రద్ధతో క్రమశిక్షణతో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.

సంప్రదాయబద్ధంగా పారువేట ఉత్సవం



పారువేట ఉత్సవానికి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీసమేత వేణుగోపాలస్వామి, శ్రీ పార్వతి సమేత మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం పారువేట ఉత్సవాన్ని గ్రామపెద్దలు, ఆలయ పురోహితులు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీసమేత వేణుగోపాల స్వామి, శ్రీ పార్వతీసమేత మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను నంది, హస్వవాహన పల్లకీలో గ్రామ పొలిమేర వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ గొర్రెను వదిలి పారువేట కార్యక్రమం నిర్వహించారు. పారువేట గొర్రెను పట్టుకునేందుకు యువకులు పోటీపడ్డారు. చీకటి పడడంతో పారువేట గొర్రె ఎవరికీ దొరకక దేవతామూర్తుల విగ్రహాలతో అందరూ నిరాశతో వెనుతిరిగి గ్రామానికి చేరుకున్నారు.

ఈత సరదా.. కారాదు వ్యథ



కేసీ కాల్వలో ఈత కొడుతున్న బాలలు

జూపాడుబంగ్లా: ఆదివారం పాఠశాలలకు సెలవు కావడంతో కొంత మంది విద్యార్థులు కేసీ కాల్వలో సరదాగా ఈతకొడతూ కనిపించారు. ఈత నేర్చుకోవాలనే సరదా ఉన్న చిన్నారులు తల్లిదండ్రుల, పెద్దల పర్యవేక్షణ లేకుండా కాల్వలు, చెరువులు, బావుల్లో ఈత కొడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సరదాగా ఈతకోసం వెళ్లి ఎంతో మంది చిన్నారులు కేసీ కాల్వ, చెరువులు, కుంటల్లో పడి ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలను గమనిస్తూనే ఉన్నాం. ఈత నేర్చుకోవాలనే సరదా ఉన్న వారు ఈత వచ్చిన తల్లిదండ్రులను వెంటబెట్టుకొని వెళ్లి వారి పర్యవేక్షణలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఈతనేర్చుకోవాలని పెద్దలు సూచిస్తున్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం

నంద్యాల(అర్బన్): ఐకమత్యంతోనే వాల్మీకుల సంఘం అభివృద్ధి సాధ్యమని వీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నందున సంఘం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. స్థానిక బొగ్గులైన్ ప్రాంతంలోని వాల్మీకి సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సిద్ధించి 70ఏళ్లు అవుతున్నా బోయలు నేటికీ అభివృద్ధి చెందడం లేదన్నారు. నాయకులు రమేష్, ఎల్ల సుబ్బు, టైలర్ శేఖర్, శేఖర్, హనుమంతు, గోపాల్, కిరణ్ పాల్గొన్నారు.

అరుణవర్ణ ఆకాశం!



నవగ్రహాల ఆలయం వద్ద ఎరుపెక్కిన నింగి

మహానంది: ఉదయం నుంచి నిప్పులు కక్కుతూ వేడిని పంచిన భానుడు సూర్యాస్తమయం సమయంలో మండుతున్న కొలిమి నుంచి వచ్చే ఎర్రటి కాంతులు ఆకాశంలో ఆవిష్కృతమయ్యాయి. గాజులపల్లె స్టేషన్ సమీపంలోని నవగ్రహాల ఆలయం, మహానందిలోని రుద్రగుండం కోనేరుల మండప గోపురాల అందాలకు ఆకాశంలోని ప్రకృతి అందాలు జతకలవడంతో అబ్బురపరిచే దృశ్యాలు ఆదివారం కనువిందు చేశారు.

ఘనంగా మౌనస్వామి ఆరాధనోత్సవం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని ఫిల్టర్‌బెడ్ సమీపంలో ఉన్న మౌనస్వామి ఆశ్రమంలో ఆదివారం 46వ ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ కార్యనిర్వాహక సభ్యులు, భక్తులు మౌనస్వామి జీవసమాధికి మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం చేసిన తర్వాత లోకకల్యాణార్థం పాశుపత హోమం నిర్వహించారు. అనంతరం ఆశ్రమ గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ 1977లో స్వామివారు జీవసమాధి పొందారని అప్పటి నుంచి దేవస్థానంలో పరిచారకులుగా పనిచేసిన కరివీరప్ప ఆశ్రమ నిర్వహణ చేసేవారని, స్వామివారితో పరిచయ భాగ్యం కల్పించిన ఆయన కూడా తమకు గురువు వంటివారని అన్నారు. కార్యక్రమంలో ఆశ్రమాధిపతి బసవరాజస్వామి, అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, సభ్యులు చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు స్థానాలకే మురిసిపోవద్దు

- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- పొదుపు మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ



పొదుపు మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, భువనేశ్వరరెడ్డి

మహానంది: ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో మూడు స్థానాల్లో గెలిచినందుకే ప్రతిపక్ష నేతలు మురిసిపోవడం కల్లు తాగిన కోతి గెంతులేసినట్లుందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మహానందిలోని శాలివాహన(కుమ్మరి)అన్నదాన సత్రం వేదిక వద్ద ఆదివారం సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ మూడు స్థానాలకే మురిసోవద్దని, ప్రజానేత సీఎం జగన్ ఉండగా మీ పప్పులు, ఉప్పులు ఉడకవ్ అన్నారు. తెలవారకముందే అవ్వా, తాత, అమ్మా, అక్కా అంటూ తలుపుతట్టి పింఛను అందిస్తున్న వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. భారతదేశంలో ఏ సీఎం చేయలేని విధంగా 98శాతం హామీలు అమలుచేసిన ఏకైక సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు.

మహిళలకు అండగా సీఎం జగన్

ఎన్నికష్టాలొచ్చినా ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం జగన్ మహిళలకు అండగా నిలిచారన్నారు. ఆదివారం సాయంత్రం శాలివాహన సత్రం వేదిక వద్ద వైఎస్సార్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం రూ.6,400కోట్లు వెచ్చించడం చారిత్రాత్మకమైనదిగా అభివర్ణించారు. మహానంది మండలంలోని 666 గ్రూపులకు రూ. 18.89కోట్లు రాగా మూడవ విడతలో రూ. 4.71కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఏపీఎం శ్రీనివాసులు, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, మండల నాయకులు కొండా మధుసూదన్‌రెడ్డి, రఘు, బుక్కాపురం శ్రీను, శాలివాహన సత్రం ప్రతినిధి తమ్మడపల్లె శివయ్య, ఎంపీటీసీలు చౌటుపల్లి నరసింహులు, వెంకటేశ్వర్లు, మండల నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఎమ్మెల్యే శిల్పా

గోపవరం గ్రామంలో నీటికుంటలో పడి మృతి చెందిన విజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.పదివేల ఆర్థికసాయం అందించారు. అలాగే గ్రామంలో ఘర్షణలో మృతి చెందిన చెవుల శ్రీనివాసులు కుటుంబానికి రూ.పదివేల ఆర్థిక సాయం అందించారు. అల్లీనగరంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మధు, విజయ్‌ల కుటుంబాలకు రూ.పదివేలు అందించి అండగా నిలిచారు. ఇటీవల రైలుప్రమాదంలో మృతిచెందిన బుక్కాపురం సురేష్ కుటుంబానికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2 లక్షలను ఆయన భార్య సుమిత్రకు అందించారు. అలాగే మరికొందరికి సీఎం రిలీఫ్ ఫండ్, సీఎం సహాయనిధి ద్వారా వచ్చిన రూ.6లక్షల చెక్కులను పంపిణీ చేశారు. అబ్బీపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత డమాల నాగరాజు మృతి విషయం వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శరభారెడ్డి చెప్పడంతో గ్రామానికి రాత్రి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

శ్రీశైలం తరహాలో మహానంది అభివృద్ధి

మహానంది: శ్రీశైలం తరహాలో మహానంది అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్నాని, భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలను కల్పించేందుకు అన్ని ప్రణాళికలు రూపొందిస్తున్నామని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. టీటీడీ నిధులు రూ.4.60కోట్లతో ముప్పై వసతిగృహాల నిర్మాణానికి ఆదివారం శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్తలతో కలిసి భూమిపూజ చేశారు. ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు రవిశంకర అవధానిల ఆధ్వర్యంలో శాస్త్రోక్త పూజలు చేశారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పాలకులు ఆలయ ఆదాయానికి గండికొట్టారని మండిపడ్డారు. గతంలో రూ.65లక్షలు డిపాజిట్లున్న ఆలయానికి ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నాక కేవలం ఏడాదిలోనే రూ. 8.08కోట్లు నిలువ ఉంచడం అభినందనీయమన్నారు. ఆలయంలో అవినీతిని అరికట్టడంతో 2021–22లో హుండీ ఆదాయం రూ. 1.43కోట్లు రాగా 2022–23లో రూ.2.90కోట్లు ఆదాయం పెరగడం విశేషమని కొనియాడారు. రూ.రెండు కోట్ల స్వంత నిధులతో సుందరీకరణ పనులు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగభూపాల్‌రెడ్డి, మేదర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టంగుటూరి గౌరీదేవి, మహానంది సర్పంచ్ చలంచలం శిరిష, ఎంపీటీసీ దైవందిన్నె వెంకటేశ్వర్లు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.